క్లుప్తంగా

ముగిసిన 'పది' పరీక్షలు

పెంచికలపేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. జెడ్పీఎస్ఎస్ పెంచికలపేట్, చేడ్వాయి, ఆశ్రమ పాఠశాల ఎల్లూర్, కమ్మర్గాం చెందిన 147 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు పరీక్ష కేంద్రం సీఎస్ అరవింద్, డీవో అరవింద్ తెలిపారు.

విద్యార్థినికి అభినందన



ఝాన్సీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న జాడె ఝాన్సీని బుధవారం జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, ఉపాధ్యాయులు అభినందించారు. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశ పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించడంతో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లోనవెల్లి కాంప్లెక్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బండయ్య, సీఆర్‌పీ రాజేశ్, ఉపాధ్యాయులు ముజకిర్ అహ్మద్, జమున, సునీత, అర్చన పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి గ్రామానికి చెందిన సుర్పం కళావతి బుధవారం వేకువ జామున పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది గ్రామానికి చేరుకొని సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే పురిటి నొప్పులు అధికమవడంతో అంబులెన్స్‌లోనే గర్భినికి టీఎంటీ అజయ్‌కుమార్ ప్రసవం చేశారు. అనంతరం సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిబిడ్డా క్షేమంగానే ఉన్నారని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



బోరుబావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇచ్చోడ: మండలంలోని తాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. బుధవారం మండలంలోని హరినాయక్ తండా, నర్సాపూర్ గ్రామాల్లో పర్యటించారు. మిషన్ భగీరథ నీటితో పాటు గ్రామాల్లో ఉన్న బోరు బావుల ద్వారా నీటిని వాడుకోవాలన్నారు. మండలంలో ప్రసుతం తాగునీటి సమస్య లేదన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని సోనాల మండలం ఘనపూర్‌కు చెందిన కృష్ణ మహారాజ్ అన్నారు. బుధవారం మ ండలంలోని వాగ్దారి గ్రామంలోని జగదాంబ దేవి ఆలయ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మద్యం, మాంసానికి యువత బానిస కావద్దన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి నిత్యం గ్రామంలోని ఆలయాలను దర్శించుకొని పూజలు చేయడంతో కుటుంబాల్లో సుఖసంతోషాలు నెలకొంటాయన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సన్నబియ్యంతో నిరుపేదలకు మేలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి



రెబ్బెన: బియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: సన్న బియ్యంతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మితో కలిసి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుందని, ప్రజా సంక్షేమంలో భాగంగా పేదవారి కడుపు నింపేందుకు ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లాలోని 314 రేషన్ దుకాణాల ద్వారా రేషన్‌కార్డు దారులకు ఉచితంగా సన్నబియ్యం అందించడం జరుగుతుందన్నారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ సైతం నిరంతరం కొనసాగుతుందని పేర్ల తొలగింపు, చేర్పుల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. బియ్యం పంపిణీలో ఏమైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ అర్హులైన పేదవారి కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సైతం కార్డులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమాల్లో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, రంగు మహేశ్ పాల్గొన్నారు.

కౌటాల: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండలంలోని బోదంపల్లి, నాగేపల్లి గ్రామాల్లోని రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని పేదలు ఆకలికి అలమటించొద్దని ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. అర్హులైన పేదల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీ దత్తారావ్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, తహసీల్దార్ పుష్పలత, కార్యదర్శి సంధ్య, నిహారిక, గంగారం, విఠల్, నాహీం, ఏమాజీ పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సన్నబియ్యం పంపిణీని ఎమ్మెల్సీ ప్రారంభించారు. అనంతరం మండలంలోని డబ్బా గ్రామంలో నూతనంగా మంజూరైన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఉమా మహేశ్, మేకల ప్రసాద్, భీంకరి నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిర్యాణి: రేషన్ దుకాణాలల్లో లబ్ధిదారులకు అందజేస్తున్న సన్న బియ్యంను లబ్ధిదారులు స్వదినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రమాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణం వద్ద సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఎంపీడీవో వేముల మల్లేశ్, చిత్తారి సాగర్, పాల్గొన్నారు.

వాంకిడి: మండల వ్యాప్తంగా బుధవారం రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు గుర్నులె నారాయణ, సుధాకర్, దీపక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: సన్న బియ్యం లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి సరిత అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లారం గ్రామంలో సన్న బియ్యంను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీలర్ ఆత్మరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండలంలోని లింగాపూర్, జాముల్ ధర గ్రామాల్లో సన్న బియ్యం కార్యక్రమాన్ని బుధవారం మండల డిప్యూటీ తహసీల్దార్ పెద్దిరాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జాదవ్ లోకేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంచందర్, ఆత్రం అనిల్, జాదవ్ గణపతి, జాదవ్ రమేశ్, రాహుల్, వినోద్ పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని కోత్మీర్, ఇట్యాల గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఎంపీడీవో రాజేందర్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం అందిస్తుందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కౌటాల: బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ విఠల్



తిర్యాణి: బియ్యం పంపిణీ చేస్తున్న అధికారి



వాంకిడి: పంపిణీ చేస్తున్న డీటీ శ్రావణ్ కుమార్



దహెగాం: కోత్మీర్‌లో..

తప్పనిసరిగా టీకాలు వేయించాలి



పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: ప్రతీ నెల తప్పకుండా టీకాలు వేయించాలని హెచ్ఈవో రవిదాస్ అన్నారు. బుధవారం మండలంలోని కనర్గాం ఉప ఆరోగ్య కేంద్రంలో సందర్శించి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, 5 సంవత్సరాల లోపు పిల్లలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ జాగ్రత్తలు వివరించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రత్నమాల, సునీత, భగవాన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నర్సరీని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల వివరాలను కార్యదర్శి సంగీతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాళీ బ్యాగులు లేకుండా చూసుకోవాలన్నారు. మొలకెత్తని బ్యాగుల్లో వేర్లు, ఇతర విత్తనాలని నాటాలని సూచించారు.

డబుల్ రోడ్డుకు గ్రహణం..!



కోత్మీర్ నుంచి దహెగాం వరకు ఉన్న సింగిల్ రోడ్డు

- గతేడాది డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు
- ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు

దహెగాం: అంగట్లో అన్ని ఉన్నా.. అల్లుడు నోట్లో శని అన్న చందంగా మారింది దహెగాం, కాగజ్‌నగర్ రోడ్డు పరిస్థితి. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని గత ప్రభుత్వం చెప్పి కాగజ్‌నగర్ నుంచి మండలంలోని కోత్మీర్ వరకు 18 కిలో మీటర్ల మేర గత ఆరు సంవత్సరాల క్రితం డబుల్ రోడ్డు నిర్మించింది. కోత్మీర్ నుంచి దహెగాం వరకు సింగిల్ రోడ్డు ఉంది. ఉన్న సింగిల్ రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకంగా మారింది. గత సంవత్సరం ఎన్నికలకు ముందు కోత్మీర్ నుంచి దహెగాం మండల కేంద్రం వరకు డబుల్ రోడు నిర్మాణానికి రూ. 32 కోట్లు మంజూరు చేసింది. అయినా రోడ్డు పనులు ప్రారంభం కాలేదు.

12 కిలో మీటర్లకు రూ. 32 కోట్లు..

డబుల్ రోడ్డు నిర్మాణం కోసం అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం ఆర్అండ్‌బీ శాఖ రూ. 32 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు కూడా పూర్తి చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాదిన్నర అయినా పనులు ప్రారంభించ లేదు. గత రెండు నెలల క్రితం రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించగా పనులు ప్రారంభం అవుతున్నాయి అనుకున్న ప్రయాణికుల, ప్రజల ఆశ నిరాశగానే మిగిలింది. పనులు ప్రారంభించక పోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంటకు పైగా ప్రయాణం..

మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్ పట్టణం 30 కిలో మీటర్ల దూరం ఉంది. ఈరోడ్డు గుండా ప్రయాణానికి సుమారు గంటకు పైగానే పడుతుందని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అవసరాల నిమిత్తం వందలాది మంది ప్రైవేటు వాహణాల్లో, కార్లో, బైక్‌లపై ప్రయాణం చేస్తుంటారు. అదే విధంగా కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద డబుల్ రోడ్డు పనులు నిలిచి పోవడంతో సుమారు 200 మీటర్ల రోడ్డు గుంతలు ఉన్నాయి. వర్షాకాలంలో గుంతలలో వర్షపు నీరు నిలిచి పోవడంతో ప్రయాణం నరకంగా మారుతుందని వాపోతున్నారు.

గుంతలమయంగా రోడ్డు



దహెగాం నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే గంటకు పైగా సమయం పడుతుంది. మండల కేంద్రం నుంచి కోత్మీర్ వరకు సింగిల్ రోడ్డు ఉంది. ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. గుంతలకు మరమ్మత్తులు కూడా చేపట్టడం లేదు.

– బొల్లబోయిన రవి, వాహనదారుడు

ఇబ్బంది పడుతున్నాం



కోత్మీర్ నుంచి దహెగాం వరకు సింగిల్ రోడ్డు ఉంది. ఉన్న సింగిల్ రోడ్డు గుంతలమయంగా మారింది. పెసరికుంట, బీబ్రా గ్రామాల వద్ద గత మూడు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు రోడ్డు కోతకు గురైంది. అవసరాల నిమిత్తం దహెగాం మండల కేంద్రానికి వెళ్తుంటాం. రోడ్డు బాగా లేనందున తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.

– రాజ్‌కుమార్, బొర్లకుంట

'రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర'



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు దొడ్డిగూడ, ధాబా, సవాతి, బండకాస, చిచ్చుపల్లి, నవేధరి గ్రామాల్లో బాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం ప్రాముఖ్యత, రాజ్యాంగ మార్పు కోసం జరుగుతున్న కుట్రపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం మార్చితే మైనార్టీలు హక్కులు కోల్పోతారని, బలహీన వర్గాల వారు రిజర్వేషన్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మండోకర్ అనిల్, గుర్నులె మెంగాజీ, దుర్గం జీవన్, వడ్గురె సంతోష్, హనుమంతు, జైరాం పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంతోష్

రెబ్బెన: మండలంలోని ఆరె కులస్తులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరె కులస్తులు ఆర్థికంగా వెనకబడి ఉన్నప్పటికీ రెబ్బెన తహసీల్దార్ ఆరె కులస్తులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీ చేయటం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇతర ఉద్యోగ ఉపాధి అవకాశాలకు మండలంలోని ఆరె కులస్తులు దూరం అవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్టిఫికెట్లు మంజూరు చేసేలా చూడాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో భాగవత ప్రవచనం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కౌటాల: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో శ్రీదేవి భాగవతం ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రవచకులు బ్రహ్మ శ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ, ఫణిగంటి కిరణ్‌శర్మ భక్తులకు శ్రీదేవి భాగవతం ప్రవచనం బోధించారు. ఆలయ కమిటీ సభ్యులు వొజ్జల వెంకన్న, సభ్యులు పాల్గొన్నారు.

'మరుగుదొడ్ల' నిధులు వెనక్కి..!

- వెనక్కి తీసుకుంటున్న ప్రభుత్వం
- మండలం నుంచి రూ. 43.47లక్షలు
- లబ్ధిదారులకు చేరాల్సిన నిధులు ప్రభుత్వ ఖాతాలోకి..



రెబ్బెన: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ మరుగుదొడ్లను మంజూరు చేసింది. ప్రతీ ఒక్క ఇంటిలో తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండేలా చర్యలు చేపట్టింది. దీంతో అన్ని గ్రామాల్లో దాదాపు ప్రజలంతా వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకున్నారు. అయితే నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో బిల్లులు అందించక పోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ ఖాతాలకు బదిలీ చేసిన నిధులు గత కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా పడి ఉంటున్నాయి. దీంతో వీడబ్ల్యూసీ (ఎస్‌బీఎం) కింది పంచాయతీలకు గతంలో బదిలీ చేసిన నిధులను వెనక్కి తీసుకుంటోంది.

లబ్ధిదారులకు చెల్లించకుండానే..

ఒకొక్క మరుగుదొడ్డి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 12వేలు మంజూరు చేయగా పనులు చేపట్టిన తరువాత రూ. 6వేలు, నిర్మాణాలు పూర్తి చేశాక మిగిలిన రూ.6 వేలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా అందించేది. అయితే అనేక కారణాలతో లబ్ధిదారులకు బిల్లులు అందించలేదు. నిర్మాణాలు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడం, తలుపులు బిగించకపోవడం, బేసిన్ బిగించకపోవడం, సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేపట్టకపోవడం పనులు పెండింగ్‌లో ఉన్న కారణంగా పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు బిల్లులు అందించలేదు. కొంత మంది నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ పంచాయతీ కార్యదర్శులు బిల్లులు చెల్లించకుండా నెలల తరబడి తిప్పించుకోవడంతో లబ్ధిదారులు బిల్లుల సంగతే మర్చిపోయారు. ఆ నిధులను తిరిగి వెనక్కి పంపించాలని సర్క్యులర్ విడుదల చేయడంతో ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులంతా వెనక్కి పంపించే పనిలో ఉన్నారు.

మండలంలో రూ. 43,37,637 నిధులు..

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో వీడబ్ల్యూఎస్‌సీ ఖాతాల్లో రూ. 43,37,637ల నిధులు గత కొన్ని సంవత్సరాలుగా మగ్గుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి ప్రభుత్వ ఖాతాలో జమ చేసే పనుల్లో అధికారులు ఉన్నారు. మండలంలో అత్యధికంగా నంబాల గ్రామ పంచాయతీలో రూ. 16,33,332 ఉండగా, ఆ తరువాత రెబ్బెన గ్రామ పంచాయతీలో 8,54,912 నిధులు ఉన్నాయి. అత్యధిక వీడబ్ల్యూఎస్‌సీ నిధులు ఉన్న గ్రామ పంచాయతీలలో గోలేటి రూ. 5,05,000, తుంగెడలో 4,97,690, నవేగాం రూ, 1,56,225, మాద్వాయి గూడలో రూ. 1,05,440, లక్ష్మీపూర్‌లో 1,01,60 మిగిలి ఉన్నాయి. ఇక రాంపూర్, ధర్మారం, కైరిగూడ గ్రామపంచాయతీల్లో సున్న నిల్వలు ఉండగా మిగిలిన పంచాయతీల్లో 1 లోపు ఉన్నారు. మండలం మొత్తంగా రూ. 43.37లక్షల నిధులను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా పంచాయతీ ఖాతాల్లోనే సంవత్సరాల తరబడి నిల్వ ఉంచి తిరిగి ప్రభుత్వానికి పంపించనున్నారు.

ప్రభుత్వానికి పంపిస్తున్నాం

గ్రామ పంచాయతీల వీడబ్ల్యూఎస్‌సీ ఖాతాల్లో ఉన్న నిధులను వెనక్కి పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాంతో గ్రామ పంచాయతీల వారీగా వీడబ్ల్యూఎస్‌సీ ఖాతాల్లో ఉన్న మొత్తాలను ప్రభుత్వానికి బదిలీ చేస్తున్నాం. ఇప్పటి వరకు మండలంలోని సుమారు రూ. 12లక్షల వరకు బదిలీ చేశాం.

– శంకరమ్మ, ఎంపీడీవో, రెబ్బెన

ఇప్పటికీ బిల్లు అందలేదు



వ్యక్తిగత మరుగుదొడ్డి మంజూరు అయిందని చెప్పడంతో 6 సంవత్సరాల క్రితం మరుగుదొడ్డి నిర్మించుకున్నా. పనులు సగం వరకు అయితే రూ. 6వేలు, పనులన్ని పూర్తయితే మిగిలిన రూ.6వేలు వస్తాయని చెప్పారు. నేను నిర్మాణ పనులు మొత్తం పూర్తి చేసినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క పైసా కూడ అందలేదు. – పత్తెం భాస్కర్, భగత్‌సింగ్‌నగర్

నా బిల్లును డ్రా చేసుకున్నారు



మరుగుదొడ్డి కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం మరుగుదొడ్డిని మంజూరు చేసింది. సొంత డబ్బులతో మరుగుదొడ్డిని పూర్తిగా నిర్మించుకున్నా. రూ. 12వేలు వస్తాయని చెప్పిండ్లు కాని చెల్లించలేదు. నా పేరు మీద వచ్చిన బిల్లును డ్రా చేసుకున్నారు. పంచాయతీ అధికారులు నాకు రావాల్సిన బిల్లును ఎవ్వరికి ఇచ్చారో కూడా చెప్పలేదు. – జటంగుల వెంకటేశ్, గోలేటి